
# అపురూపమీ లేఖ

బి. పద్మజ




## సాయంత్రం

ఏడు గంటలయ్యింది. అయినా ఎండ చాలా ఉంది. చీకటి ఛాయలే లేవెక్కడా. ఈ టొరంటో నగరంలో వేసవికాలం రాత్రి తొమ్మిది దాకా ఇలాగే వెలుతురుంటుంది. పది గంటలక్కాని చీకటి పడదు.

అదే చలికాలం లోనైతే సాయంత్రం నాలుగు గంటలకంతా చీకటి పడిపోతుంది.

కారు పార్క్ చేసొచ్చి, లిఫ్ట్ చూస్తూ నిలుచున్నాను. ఈలోగా ఎలీజా మెయిల్ రూంలో నుంచి బయటకొస్తూ, నన్ను చూసి హలో చెప్పింది.

"డోంట్ యూ చెక్ యువర్ మెయిల్." నవ్వుతూ అడిగిందామే.

"ఓ ష్యూర్ .... థాంక్స్ ఫర్ రిమైండింగ్...." అంటూ మెయిల్ రూం వేపు నడిచాను.

మెయిల్ బాక్స్ నిండా బోలెడు సేల్స్‌కు సంబంధించిన ఫ్లైయ్యర్స్ వున్నాయి.

రోజూ ఇలా పిజ్జాహట్ మొదలుకొని సియర్స్, ఈటన్స్‌ల వరకు రంగు రంగుల వాణిజ్య ప్రకటనలతో మెయిల్ బాక్సులను నింపేస్తూ వుంటారిక్కడ. ఇంకా ఏవేవో బిల్స్ వస్తూనే వుంటాయి. అందుకనే మెయిల్ బాక్స్ ఖాళీగా అంటూ వుండదు.

అవన్నీ పట్టుకొని, అపుడే ఆగిన లిఫ్ట్‌లో కాలుపెట్టాను. అది మెల్లగా ఒక్కో చోట ఆగుతూ,, పదహారో అంతస్థులో నిలిచింది. మా అపార్టుమెంట్

వున్నది అదే అంతస్థులోనే.

ఇంట్లోకి రాగానే టెలిఫోన్ రింగర్ '5' కి సెట్ చేసి, ఏ.సి. ఆన్ చేసుకొని అలాగే ఓ పది నిముషాలు సోఫాలో కూచున్నాను.

మెల్లగా లేచి కాఫీ కలుపుకొని తాగుతూ మెయిల్ చూడటం మొదలుపెట్టాను.

ఆ రంగుల ప్రకటనల కాగితాల మధ్య ఓ తెల్లటి కవర్ నన్ను పలకరించింది.

చూడగానే తెలిసిపోయింది అది ఇండియానుండి వచ్చిన ఎయిర్ మెయిల్ అని.

ఒక్కసారిగా మనస్సంతా సంతోషం ఆవరించింది.

ఆత్రంగా కవర్‌పైన ఫ్రం అడ్రస్ చూసాను.

మధు... మధుమాలతి నుండి ఆ లెటర్...

ఎన్నిరోజులు, కాదు కాదు, ఎన్నేళ్లయ్యింది మధునుండి నాకు లెటర్ వచ్చి.

మధుయే కాదు ఇంకెవ్వరి దగ్గరనుండి కూడ లెటర్ రావడం అన్నది జరిగి ఎన్ని ఏళ్లయ్యిందో...



ఆ లెటర్ చేతిలోనికి తీసుకుని, చిరపరిచితమైన ఆ వ్రాతను చూస్తుంటే ఏదోలా వుంది.

మధు వ్రాసిన అక్షరాలలో నా పేరు నాకే కొత్తగా, వింతగా ఇంకా చెప్పాలంటే చాలా అందంగా అనిపిస్తోంది.

పొందికగా, మధు చేతివ్రాతతో వున్న ఆ అడ్రసులోని నా పేరు నన్నే చూస్తూ, "ఏయ్ నేను గుర్తున్నానా..." అంటూ మధుయే నన్ను అడిగినట్లు అడుగుతున్నది.

ఎందుకనో 'హ్యాండ్ రిటన్' అడ్రస్‌లో నా పేరు చూసుకొంటుంటే నన్ను నేను గుర్తించినట్లుంది. మళ్లీ నా పాత రోజుల్లోని "నేను" లాగా అవ్వాలనిపిస్తున్నది, అవుతున్నట్లనిపిస్తోంది.

చాలా, చాలా రోజుల తరువాత నాకందిన 'సజీవమైన' లేఖ అది.

ఇంకెక్కువ సేపు ఆగలేకపోయాను.

నెమ్మదిగా, చాలా పదిలంగా ఉత్తరం చించి చదవడం మొదలెట్టాను.

ప్రియమైన రేణూ,

ఎలా వున్నావు.

నేను బావున్నాను.

నాకు తెలుసు 'బావున్నాను' అన్న ఒక పొడిమాటతో నన్ను నేను వర్ణించుకోవడం నాకిష్టం వుండదు... నేనెలా ఉన్నానో వివరంగా, నా గురించిన మొత్తం విషయాలు, విశేషాలు వ్రాస్తే కానీ నీకు మనసొప్పదు.

కానీ రేణూ, ఇప్పుడలా నీకిష్టమైన విధంగా వ్రాయాలనే నా ప్రయత్నం.

'నేన్నీకు గుర్తున్నానా', 'నన్ను మర్చిపోయావు కదూ' లాంటి మాటలకు మన మధ్య చోటు లేదని తెలుసు నాకు.

అయితే అమాంతంగా నీవిలా అనంత దూరంగా వెళ్లిపోతావని, అలా అదృశ్యమైన నీవు కనీసం అక్షరాలలోనయినా అగుపించకుండా పోగలవని నేనెపుడూ అనుకోలేదు.

ఓ రకంగా చూస్తే నేనయినా అంతేగా.

కొత్త బంధంలో చిక్కి, అమ్మకూడా దూరమైపోయాను.

అమ్మకైనా ఆర్నెల్లకోసారి లెటర్ వ్రాస్తున్నాను.

అలాగని మర్చిపోవడం కాదు. అనుక్షణం గుర్తుంటుంది అమ్మ. అయినా సరే అదంతే.

అలాగే నీవు కూడా.

నీవు లేవిక్కడ. కానీ నీకు నాకు ప్రతిక్షణమూ ఏదో రూపాన కనిపిస్తుంటావు.

నేనూ, నీవూ కలిసి ఆల్చిప్పలతో చేసిన ఫ్లవర్‌పాట్, అందులో నేనుంచే క్రోటన్స్, మందారాలూ, నీ గురించి అడుగుతుంటాయి.

మన స్నేహంలో నా ఫస్ట్ బర్త్‌డేకి నీవిచ్చిన 'అమృతం కురిసిన రాత్రి', నీ కిష్టమైన లత పాటలు 'యే జిందగీ ఉసీ కా హై....' 'ఆజ్ ఫిర్ జీనే కీ తమన్నా హై..'

సాగర్ పిక్నిక్‌లో మనిద్దరం కలసి తీయించుకున్న ఫొటో, పట్టు పట్టి మీ అక్కయ్య దగ్గర నేర్చుకొని, నీవు నాకు కుట్టి పెట్టిన అద్దాల బ్లౌజు,

నీవు సెలవులకని వూరువెడితే, నేనూ, అర్చనా కలిసి సంజీవ్ కుమార్ 'ఆంధీ' చూసామని నీవు తిట్టిన తిట్లూ,

నీవు ఢిల్లీకెళ్లిన మొదటి రోజుల్లో వ్రాసిన లెటర్స్....

నీవు నా ఫస్టు మ్యారేజ్ ఆనివర్సరీకి పంపిన గ్రీటింగ్స్...

సుదూరం నుండి నాకోసం ఫోన్ మీదుగా నీవు పంపిన, పంపే నీ మాటలూ

ఇవన్నీ నీకన్నీ సుపరిచితాలు...

నీకో విషయం తెలుసా... నీవు నా కందించిన స్నేహకాలం నాలుగేళ్లు అయితే, నీ స్మృతులు నాకందించే స్నేహం కలకాలం... అవును కదూ...

నీకు గుర్తుందా...

రోజా అక్కయ్యతో ఏదో ఒకదానికి పోట్లాడేదానివి. అలాంటిది తను పెళ్లి అయ్యి, వెళ్లిపోతోందని తలుపులు బిగించుకుని ఒకరోజంతా గదిలో నుండి బయటకు రాకుండా ఏడ్చావు. 'అదేం కాదు తలనొప్పి... అంతే' అని బుకాయించావు కూడా..

'నీకు పూవులు కట్టడం రాదు కానీ, మరింత పెద్దమాల కావాలని మాత్రం బాగా గొడవ

## అతనికే చెబుతుందట!

**ప్రేమిస్తే?:** షరతులు లేకుండా ప్రేమిస్తా.

**భయం కలిగేది?:** ఒంటరిదాన్నైపోతానేమోనని.

**నచ్చనిది:** నన్నెవరైనా ద్వేషించటం.

**బలం:** మా అమ్మగారు.

**బలహీనత:** ఇతరుల బలాన్ని చూసి డీలాపడిపోవటం.

**నా తీవ్రమైన కల్పన:** అతనికే చెబుతా!

**నా హీరో:** ఎవ్వరూ చూడనివ్యక్తి. చాలా వ్యక్తిగతం!

**అలుపు కలిగించేది:** అనవసరమైన సలహా, ఎప్పుడూ చెబుతుండటం.

**నన్ను కదిలించేది:** అరుదైన నిజాయితీ.

**పుట్టినరోజు:** 17 నవంబరు.

అవండీ దక్షిణాది నుంచి బాలీవుడ్ చేరిన కీర్తిరెడ్డి కబుర్లు!

ఎస్.

చేస్తావని' ఉడికించినందుకు, పంతం పట్టి మూడు రోజులలో పెద్దమ్మ దగ్గర పూవులు మాలగా కట్టడం నేర్చుకున్నావు...

ఇప్పుడు అలాగే వున్నావా రేణూ....

నీకలా వ్రాస్తుంటే నా మనసుకెంత హాయిగా వుందో తెలుసా...

నీతో మాట్లాడుతున్నట్టే వుంది.

కాకపోతే బదులుగా నీ మాటలు లేవు....

ఎప్పుడొస్తావు రేణూ...

నీ గురించి మరిన్ని కొత్త జ్ఞాపకాలను నా సంకలనంలో చేర్చడానికయినా రాకూడదూ...

నేనిలా వ్రాయడం హేమూ కెంత జెలసీయో....

"నీకు రేణూయే ప్రాణంలే...."

అంటూంటాడెప్పుడూ... ....

ఇంకా ఏం వ్రాయను రేణూ...

చాలా, చాలా చెప్పాలనుంది. కానీ చెప్పాలనుకొన్నవన్నీ ఒకోసారి మౌనకావ్యాలే అవుతాయి కదూ...

మౌనానికి అందని భాష్యాలు లేవేమో కదూ...

కాని మన మధ్యనున్న ఈ మౌనాన్ని అక్షరాలలో నా కందించవూ... రేణూ నీకు తెలుసా, నీ నుండి లెటర్ రాక ఎన్ని రోజులయ్యిందో... నేనూ అలాగే నీ ఫోన్లతో సరిపుచ్చుకుంటున్నాను.

కానీ నిజానికి నీ నుండి చాలా పెద్ద ఉత్తరం కావాలనుంది నాకు...

'ఎలా ఉన్నావు'... 'ఏంటీ సంగతులు' లాంటి ఫోన్ పలకరింపులకే మనల్ని పరిమితం చేసుకోవడం నాకే మాత్రం నచ్చడం లేదు.

నాకు తెలుసు నీవక్కడ చాలా బిజీగా వుంటావు.

ఇంట్లో, బయటా క్షణం తీరక లేని పనులుండొచ్చు.

అయినా సరే నాకోసం ఓ గంటో, రెండు గంటలో వెచ్చించి ఓ లేఖ వ్రాయలేవూ... ప్లీజ్, ప్లీజ్... అలా వ్రాస్తే నీవు ఈసారి వచ్చేసరికి నీకిష్టమైన 'సున్నివుండలు' చేయడం బాగా నేర్చుకొని నీకు రోజూ చేసి పెడతాను. సరేనా... ఇలాంటి లంచాలు నీకూ, నాకు కూడా ఇష్టం వుండవనుకో.... అయినా సరే ఈ ఒక్కసారికి కొద్దిగా రాజీ పడదాం. సరే కదూ...

ఏ పుస్తకమో చదువుతుంటేనో, నిదురించే ముందు 'ఛాయాగీత్' వింటూంటేనో హఠాత్తుగా నీవు గుర్తొచ్చి, నిన్ను చూడాలనిపించి, వెంటనే నీకు లెటర్ వ్రాద్దామని ఎన్నిసార్లనుకొన్నానో...

నిన్ను గుర్తుచేసుకొన్న ప్రతీసారీ అదోలాంటి భావం...

మనకత్యంత ఇష్టమైన పాట విన్న తరువాత కలిగే విషాదం, ఉద్వేగం కలగలిపిన భావన...

ఎందుకిలా...

ఈ ఉత్తరమైనా మెల్లగా పయనించి నిన్ను చేరడానికి ఎన్ని రోజులవుతుందో...


ఆపై నీవు దీనికి ప్రత్యుత్తరం వ్రాసి, అది నా కందేసరికి ఇంకెన్నిరోజులవుతుందో..

అంతదాకా నా నిరీక్షణే నాకు నేస్తం.

అవును కదూ!

నీవందించే అక్షర పారిజాతాల కోసం ఎదురుచూస్తూ.

ఇక ఉండనా మరీ




ప్రేమతో

నీ మధు

చదవడం పూర్తయ్యేసరికి నా మనసులో ఏదో తెలీని గుబులు...

ఎన్నెన్నో జ్ఞాపకాల తాలూకు పరిమళంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అనుభూతి.

కడలిలో అలల్లా ఒక్కొక్కటిగా స్మృతి తరంగాలు నన్ను నిలువునా ముంచెత్తుతున్నాయి.

ఓ వేపు ఆనందం అలలు, అలలుగా నన్ను ఆవరిస్తోంది. మరోవైపు నుండి అదోలాటి బాధ సుళ్లు తిరుగుతోంది.

ఇన్నేళ్లుగా మనసును తాకే ఓ మాటకోసం, నన్ను మనసారా పలకరించే ఓ లేఖ కోసం నాకే తెలియకుండా నేనెదురు చూస్తున్నానేమో అన్న భావన ఒక్కసారిగా కుదిపేసింది నన్ను.

ఇన్నాళ్లుగా అమ్మతోనయినా, అక్కయ్య, అన్నయ్యలతోనయినా నా పలకరింపులన్నీ ఫోన్, ఈ-మెయిల్‌ల పరిధిలో ప్రాణం లేకుండా పోతున్నాయని ఒక్కసారయినా తోచలేదెందుకని.

అమ్మకయినా లెటర్ వ్రాసి ఎన్నాళ్లయింది?

వారం, వారం ఫోన్లలో మాటలు

ఎప్పటికప్పుడు ఈమెయిల్‌లో అన్ని సంగతులు అత్యంత వేగంగా తెలిసిపోతున్నాయన్న సంతోషమే తప్ప, తీరిగ్గా కూచొని నెమ్మదిగా జ్ఞాపకాలన్నింటిని ఒక్కొక్కటే స్పృశిస్తూ, ఆరుబయట వెన్నెల్లో కూచొని ముచ్చటించుకొంటున్నట్లు, హృదయం విప్పి ఒక్క నాలుగు ముక్కలు కాగితమ్మీద వ్రాసి ఎన్ని యుగాలయ్యింది?

అసలిప్పుడు కుదురుగా కాగితమ్మీద నాలుగు ముక్కలు వ్రాయగలదా తను?

కంప్యూటర్ ముందు కూచొని టక టక టైపు చేయడమే తప్ప మూడేళ్లుగా ఒక్క అక్షరమ్ముక్క వ్రాసిన పాపాన పోలేదు.

ఎలా వుండేది తను ఒకప్పుడు.

సెలవుల్లో వూరెళ్లినా సరే ఫ్రెండ్సందరికీ పేరు పేరున బారెడు వుత్తరాలు వ్రాసేది తను.

తన స్కూలు, టీచర్స్, పాఠాలు, ఫ్రెండ్స్ గురించి కథలు కథలుగా పెద్దమ్మ, మామయ్యలకు క్రమం తప్పకుండా లెటర్స్ వ్రాసేది.

మరిప్పుడే మయ్యింది...

అందరికీ దూరంగా, సంవత్సరాలు, సంవత్సరాలు ఇలా గడిపేస్తున్నదే తప్ప ఒక్క లెటర్ వ్రాయాలన్న ఆలోచన రాలేదెందుకని.

అందరితో ఫోన్‌లో మాట్లాడుతున్నాను, అన్ని విషయాలు తెలుస్తున్నాయి అనుకోవడమే తప్ప అపురూపంగా అక్షరాలతో పలకరించుకోవాలన్న తపన లేకుండా పోయిందెందుకు తనకు.

ఇలా మధునుండి చల్లగాలిలా సేదతీరుస్తూ సరి అయిన సమయానికి ఈ లేఖ రావడం, తను విస్మరిస్తున్న ఆనందలహరులను తిరిగి తనకందించడానికే.

ఇకనుండి మరిచిపోకుండా, తరుచుగా కమ్మని పాటల మాటలను కలం వ్రాతల ద్వారా నావారికందరికి అందించాలని అనుకొనేసరికి మనసు వూరడిల్లింది.

ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కాగితం, కలం తీసుకొని కూచొన్నాను. నా ప్రియనేస్తాన్ని ప్రేమగా పలకరించడానికి.